# పరీక్షణ




డిసెంబరు రాత్రి చలి. ఎముకలను కొరికేస్తోంది.

చెట్టుకింద మంట.

మంట చుట్టూ చేరిన నలుగురి గుండెల్లోను మంట.

"ఏం బ్రతుకులు మనవి, బ్రదర్!" అన్నాడు రాజా.

"ఇప్పుడు నీ బ్రతుక్కేమి తక్కువొచ్చిందో?" గోపాలం ప్రశ్న.

"తక్కువ లేందేమిటో చెబుదూ?" మూర్తి రాజాకు మద్దతుగా నిలిచాడు.

"హాఁ! అసలు మనదీ ఒక బ్రతుకే! మనం అసలు ఎందుకు బ్రతుకుతున్నామా అని ఒక్కొక్కప్పుడు నాకు సందేహం వస్తుంది. ఒక గమ్యం లేదు, లక్ష్యం లేదు. జీవితంలో ఒక క్షణం సుఖం లేదు. దారం తెగిన గాలిపటం లాగ గాలివాటుగా కొట్టుకుపోవడమే మన పని. ఇదేనా జీవితమంటే?" అన్నాడు రాజా.

"ఏంరోయ్! ఈ రాత్రి తత్త్వ విచారణలో పడ్డావు. ఈ అన్వేషణ, ఆత్మ పరిశోధన ఎప్పటినుండి? బుద్ధ దేవుడుకూడా ఇలాంటి ప్రశ్నలను వేసుకోవడం మొదలుపెట్టిన తరవాతనే అంత గొప్ప వాడయాడట. కొంప తీసి నువ్వు కూడా ఆ బాపతు స్వామివో ఉన్నావేమిటి? ముందీ సిగరెట్టు వెలిగించు. ఈ లోకంలో పడుదువుగాని" అన్నాడు గోపాలం సిగరెట్టు అందిస్తూ.

—వి. వి. రమణమూర్తి

"నీకు నవ్వులాటగా ఉందిరా. పాపం! ఆ సాంబంగాడి సంగతే చూడు. అయిదుగురు మైనస్. స్టిల్ నాటౌట్. తల్లి, తండ్రి, భార్య— వెరశి తొమ్మిది తలకాయలు. వచ్చేది నెలకు మూడు వందల జీతం. ఒక్కడి సంపాదన మీద ఇంత మంది బ్రతుకుతున్నారు. వాడి కేదయినా అయితే. . ."

"ఊరుకోరా, అపశకునపు పక్షి!" ఇంతవరకు సంభాషణ లోనికి దిగని సత్యం విసురుగా కలగజేసుకున్నాడు.

"అపశకునం కాదురా, చావు బ్రతుకుల మధ్య కొట్టుకుంటున్నాడా? ఆ ప్రమాదం వీడికే రావాలి? ఈ ఆపరేషన్ ఫెయిలయితే ఏమవుతుందో ఊహించ లేకుండా ఉన్నానురా." నీరు కారిపోయాడు రాజు, హాస్పిటల్‌లోని మిత్రుని స్థితిని తలుచుకొంటూ.

"నిజమేలే. కారు నెక్కించే వాడు ఆక్సిడెంటుకు ముందుగా సాంబంగాడి స్థితిగతుల నన్నిటిని వాకబు చేసి, 'వీడు ఆక్సిడెంటుకు అనర్హు'డని నిశ్చయించుకోవలసింది. . . లేకపోతే ఏమిట్రా నీ వెధవ వాగుడు! ప్రమాదం జరిగింది. అది సాంబంగాడికే జరగడం మన దురదృష్టం. ప్రమాదాలు చెప్పి వస్తాయిట్రా? ఇలాంటప్పుడే మనం ధైర్యంగా ఉండాలి. లోపలి కొకసారి వెళ్ళి ఆపరేషన్ పూర్తయిందో, లేదో కనుక్కో. ఆ ముసలాళ్ళిద్దరూ, సాంబంగాడి భార్యా ఎలాగున్నారో చూసి కాస్త ధైర్యం చెప్పి రా."

గోపాలం పురమాయించిన పనులన్నీ రాజు ముగించుకు వచ్చాడు.

"వాళ్ళు ముగ్గురు కుమిలి కుమిలి ఏడుస్తున్నారురా. ఏం చెయ్యడం? ఇంకొక అర గంటకు కాని ఆపరేషన్ పూర్తి కాదట."

రాజుకు కళ్ళనీళ్ళు పర్యంతమయింది.

మంట తగ్గింది. పుల్లల నెగదోశారు. లోన చావుబ్రతుకుల మధ్య కొట్టుకుంటున్న మిత్రుని పరిస్థితిని తలుచుకుంటూ, చలిని తిట్టుకుంటూ ఎవరి ఆలోచనలలో వారు ఉన్నారు.

భరించలేని నిశ్శబ్దం.

"ఏం బ్రతుకులో. . ." వాపోయాడు రాజు.

"ఎక్కడ కంఠతా పట్టావురా, బాబూ, వెధవ డైలాగు! చంపేస్తున్నావు. పిల్లిని చంక బెట్టుకు వచ్చాము." విసుక్కున్నాడు గోపాలం.

"వాడి మీ దెందుకురా విసుక్కుంటావ్? వా డన్నదానిలో తప్పేమిటి? మనం, మన బ్రతుకులు!?" కసిగా గడ్డిపోచలను తెంపాడు మూర్తి.

"వాడు గురువు. వీడు శిష్యుడు. నా ఖర్మ." చీదరించుకున్నాడు గోపాలం.

మూర్తి తగ్గలేదు. "అసలు మనం ఎందుకు పుట్టామో, ఎందుకు జీవిస్తున్నామో తెలియదు. మన బ్రతుకులు ఎయిమ్‌లెస్."

"శ్మశాన వైరాగ్యం! వెధవలకి బ్రూట్ మెజారిటీ వచ్చింది." గోపాలం నణిగాడు.

"ఒరేయ్, వెధవాయలూ! మీరు కొట్టుకు చావకండి." ఇది సత్యం ఇచ్చిన అల్టిమేటమ్.

"గురుదేవులు ప్రారంభించారు. అంటే, పెద్ద ఉపన్యాసం వినక తప్పదన్న మాట."

"తప్పదురా, గోపీ. మీరు తగువులకు దిగారు. మీ వాదన ఇంతలో తెగదు. మీరు కొట్టుకు చావడమెందుకు? మీ ప్రశ్నలకు సమాధానాలు చెవుతాను. ఒరేయ్, గోపాలం! నువ్వు మధ్యలో డొంకతిరుగుడు ప్రశ్నలు వెయ్యకు. ముందొక సిగరెట్టిలాగ పారేయ్. రాజా, కాస్త పుల్లల నెగదొయ్యిరా. మంట చల్లారిపోతోంది" అంటూ సత్యం సిగరెట్టు ముట్టించి ప్రారంభించాడు.

" 'మనం ఎందుకు పుట్టామా' అని మూర్తి అడిగాడు. పుట్టడం, పుట్టక పోవడం మన చేతులలో లేదు. పుట్టాలని మనం పుట్టలేదు. మన పుట్టుకకు మనం బాధ్యులం కాదు కాబట్టి, ఆ ప్రశ్నకు జవాబు చెప్పవలసిన బాధ్యత మనది కాదు.

'మనం ఎందుకు జీవిస్తున్నా'మని మూర్తి రెండవ ప్రశ్న. మన దేశంలో మన లాంటి మధ్యతరగతి కుటుంబాలకు రోజూ ఎదురయ్యే ప్రశ్న. మనవి మధ్యతరగతి కుటుంబాలా, కావా అని ప్రశ్నించుకుంటే, నూటికి తొంభై మంది మధ్యతరగతనే చెపుతారు. న న్నడిగితే మన దొక నకిలీ మధ్యతరగతి. ఆ రకంగా పిలుచుకోవడం, పిలిపించుకోవడం ఒక అందమైన ఆత్మవంచన. నాలుగు ముక్కలు చదువుకొని ఉద్యోగాలకు ఎగపడడం, తరువాత ఆజన్మాంతం ఏడవడం. సామాజిక వ్యవస్థలో ఇట్టి కొత్త తరగతిని ప్రవేశపెట్టి వెడలిపోయింది ఇంగ్లీషు ప్రభుత్వం. ఇది మనకు వాళ్ళు పెట్టిన భిక్ష.

పూట తిండికి ఠికానా లేని సామాన్యుని ఆశలు, కోరికలు చాలా పరిమితం. పల్లెపట్టునుండే లక్షలాది సామాన్య కుటుంబాలుకూడా ఆధునిక నాగరికతా ప్రభావం పడనంతవరకు సంతృప్తిగానే బ్రతుకుతున్నాయని చెప్పవచ్చు. బాగా డబ్బున్నవారి ప్రపంచమే వేరు. ఈ రెండు కోవలకు భిన్నమైన, నిర్దిష్టమైన ప్రపంచం మనది. సామాన్యుని వలె తృప్తిగా జీవించడానికి నామోషీ. ధనవంతునివలె బ్రతుకుదామనే కోరిక తీరేది కాదు. త్రిశంకుస్వర్గంలో ఉన్నామన్న మాట. మన కోరికలకు పగ్గాలుండవు. కాని, జీతాల కున్నాయి. అందుచేతనే నిరంతరం అది లేదని, ఇది లేదని ఏడుస్తూ, ఆ ఏడుపుకి నిత్యం కొత్త కొత్త కారణాలను వెదుకుతూ తీరని కోరికలతో, అసంతృప్తితో, ఆవేదనతో జీవచ్ఛవాల వలె బతుకుతున్నాం.

ఈ సమాజ వ్యవస్థకు తోడు ఆడవాళ్ళ చదువులొచ్చాయి. చదువు మనో వికాసాన్ని కలిగించడం మాటేమో దేవుడెరుగు కాని, వాస్తవానికి అబ్బేది మనో వికారం మాత్రమే. ఫలితం—అసంతృప్తి, నిస్పృహ, ఏడుపు. ఏడుపుకి కారణాలెందుకు? అనుభవం లేని మన సాహిత్య పహిల్వానులు ఆడదాని ఏడుపును— అదేదో ఘనకార్యమైనట్లు— గొప్పగా వర్ణిస్తూ ఏడుపు పద్యాలను వ్రాశారు. కవులు కాబట్టి ఆ ఏడుపులకు వన్నెలు, చిన్నెలు తగిలిచ్చి శ్రావ్యంగా ఏడిపించారు. రాజీవలోచనలు — వారి ఏడుపులో శ్రావ్యతా మాధుర్యాలు! ఒక సత్యభామ వలె, ఒక గిరికవలె మా ఆవిడ ఎప్పుడయినా మృదుమధురంగా ఏడుస్తుందేమోనని పదిహేనేళ్ళబట్టి నిరీక్షిస్తున్నాను. ప్రయోజనం శూన్యం. ఏడుపయితే ఉంటుంది గాని, భాష కర్ణకఠోరంగా ఉంటుంది. ముందే చెప్పానుగా-కారణాలు వెతికడం దండుగ. నిత్యం కొత్త కొత్త కారణాలు దొరుకుతూనే ఉంటాయి. 'భర్త' అని ఉట్టినే అన్నారా? సర్వదా ఈ రకం నేపథ్య సంగీతాన్ని భరించేవాడు కాబట్టే 'భర్త' అని అన్వయించుకోవలసిన రోజు లివి. విని విని చెవులు హోరెత్తి కొన్నాళ్ళకు ఆ అసంతృప్తి— ఎంతటి జడభరతుడయినా సరే— అతడికీ ఒంటబడుతుంది. మన కున్నది స్వతహాగా కొంత, అర్ధభాగం నుండి దిగుమతి మరికొంత. ఫలితమే రెండవ ప్రశ్న."

**సుఖం తనకు తానుగా వస్తే అనుభవించడానికి ఎవరికీ అభ్యంతరం ఉండదు. అందుకోసం అవసరమైన బాధలు పడడానికి మాత్రం సిద్ధపడరు. ఇన్ని రకాల సమస్యలు చుట్టూ పద్మవ్యూహంలా తిరుగాడుతున్నా, ఆశ ఎంతకాలమైనా నిలబెట్టినా, నిరీక్షణలో ఆనందం ఉన్నా దానికి అర్థం ఉండాలిగా?**

సత్యం ఆపా-

"గాస్!" అన్నాడు గోపాలం.

"గాస్ కాదురా, గోపీ. కాచి వడబోసిన నిజం. జీవించడం ఒక కళ. అది అందరికీ చేతకాదు. మన లాంటి ఏబ్రాసిమొహాలకు అసలే చేతకాదు. ఒక రకం జీవిత పరిధిలో పరిభ్రమిస్తూ, దానిని అధిగమించే సాహసం, గుండె నిబ్బరం లేని మనుష్యులం. రేపటి రోజును విస్మరించి, 'నేడు'లో జీవించడానికి కొంత త్యాగం, మనోధైర్యం కావాలి. పది రోజుల నిత్యావసరాలను త్యాగం చేయగలిగితే ఒక రోజయినా తృప్తిగా గడపవచ్చు. ఆ త్యాగం, మనోధైర్యమే మన వద్ద లేవు. అందుకే నిత్యం ఏడుస్తూ, ఒక్క రోజు సంతోషానికికూడా మొహం వాచి బ్రతుకుతున్నాం.

నా జీవితంలో ఒకే ఒక్క కుటుంబాన్ని చూశాను. బ్రతకడ మెలాగో ఆ కుటుంబానికి కచ్చితంగా తెలుసు. వారి ననుకరిద్దామని ఒకటి రెండు సార్లు ప్రయత్నించాను. నేను చెప్పానుగా — త్యాగం, గుండె నిబ్బరం కావాలని? అవి నా దగ్గర లేవు. ప్రయత్నిద్దామని అనుకోవడంతోనే సరిపోయింది. నెల జీతాలు, మార్పులేని ఖర్చుల జాబితాలు నన్ను అట్టి ప్రయత్నానికి దిగనియ్యలేదు. నేను చెప్పబోయే కథలోని వ్యక్తులకు వర్తమానం ముఖ్యం. భవిష్యత్తు గురించి చింతే లేదు. వారి కున్నది 'నేడు', మనకు లేనిది 'నేడు'. ఆ కుటుంబం కథ వింటే నేను అన్నదానిలో అతిశయోక్తి లేదని మీరే ఒప్పుకుంటారు. ఆ నైనం చెపుతాను, వినండి."

"ఏదో కోస్తాడు కాబోలు!" గోపాలం గొణిగాడు.

కాని, రాజు, మూర్తి ఆసక్తితో వింటున్నారు. అందుకే సత్యాన్ని ప్రేరేపించారు.

"వాడి మాటలకేంగాని, చెప్పు, గురూ!"

సత్యం కథను ప్రారంభించాడు.

● ● ●

"పదిహేనేళ్ల కిందటి సంగతి. నేను కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజు లవి. పూరీలో ఒక బెంగాలీల ఇంటిలో అద్దెకు ఉండేవాడిని. దాని పేరు దుర్గా నివాస్.

దుర్గా నివాస్‌కు యజమానురాలు ఒక ముసలిది. మనుమరాలితో ఒక భాగంలో ఉంటూ, ఇంట్లో మిగిలిన మూడు వాటాలను అద్దెకు ఇచ్చింది.

రెండు నెలల తరవాత ఆమె మనుమరాలితో సహా కలకత్తాకు ప్రయాణమయింది. పోతూ పోతూ ఇంటిని, అద్దెల వసూలును పొరుగు పెద్దమనిషికి అప్పచెప్పింది.

ఉన్నట్టుండి ఒక రాత్రి ఆమె కొడుకుట— కుటుంబంతో సహా అక్కడ దిగాడు. కొన్ని బెంగాలీ కుటుంబాలు పూరీలో స్థిరపడ్డాయి. అప్పుడప్పుడు కలకత్తా వెళ్లడం, తిరిగి రావడం వాళ్లకు పరిపాటే. కలకత్తానుండి బంధుమిత్రులు వస్తుంటారు. జగన్నాథ సందర్శనం చేసి, సాక్షిగోపాల్, కోణార్క చూసి తిరిగి వెళ్లిపోతారు. ఆ మాదిరిగానే ఆయనకూడా వచ్చాడేమో అనుకున్నాను.

ఆయన కటకంలో ఏదో బాంకులో పని చేసేవాడట. బాంకు సొమ్మును వాడుకొని పీకలమీదకు తెచ్చుకున్నాడు. ఇంట్లో సామాను, భార్య ఒంటిమీద నగానట్రా అమ్మి ఆ డబ్బును ఎలాగో తీర్చుకున్నాడు గాని, ఉద్యోగం ఊడింది. అందుచేత కట్టుగుడ్డలతో బయటపడి తల్లి పీకలమీద భైఠాయించాడు.

ముసలిదానితో ఉండేది అతని పెద్ద కూతురు. రెండవది చంద్ర— పన్నెండేళ్లది. చంద్ర తరవాత ఇద్దరు కొడుకులు — అనిల్, అజిత్. ఆఖరిది ఇంద్రాణి— మూడేళ్లది. భార్య, నలుగురు పిల్లలతో ఉద్యోగం ఊడగొట్టుకొని వచ్చిన ఆ ఆసామీపై నా కేమాత్రం సదభిప్రాయం కలగలేదు.

నెలాఖరుకు నాలుగయిదు రోజులుంది. శ్రీమతి పుట్టింట్లో ఉండేదిలే. హోటలు తిండి. సత్రవు భోజనం, మఠం నిద్ర లాంటి జీవితం నాది. రాత్రి తొమ్మిదింటికి ఇంటికి తిరిగి వచ్చాను. బట్టలు మార్చుకొని పేపరు చూస్తున్నాను. చెల్లెల్ని వెంటబెట్టుకొని చంద్ర నా గదిలో ప్రవేశించింది. గడిచిన ఇరవై రోజుల లోను పిల్లలెవరూ నా గది ఛాయలకైనా రాలేదు కాబట్టి వారి రాక నా కాశ్చర్యాన్ని కలిగించింది.

అప్పట్లో నాకు బెంగాలీ సరిగా రాదు. చంద్రాకు హిందీ కొద్దిగా వచ్చు. అతి ప్రయాసపై నేను అర్థం చేసుకున్నదేమంటే— వారికి పది రూపాయలు కావాలని. ఏదో మామూలు అవసరాల కోసం అడిగి ఉంటారనుకొన్నాను.

ఆ క్షణంలో ఆ విషయం గురించి నే నంతగా పట్టించుకోకపోయినప్పటికీ, మూడు రోజుల తరవాత అసలు విషయం తెలిసింది. మూడు రోజుల బట్టీ పిల్లలకు తిండి లేదని, సహించలేని తల్లి పది రూపాయి లడగడానికి పంపిందని తెలిసిన తరవాత ఆ ప్రబుద్ధునిపై నాకు ఎంతో కోపం వచ్చింది.

ఫస్టు తారీఖు వచ్చింది. రాత్రి పది గంటలకు ఇంటికి తిరిగి వచ్చాను. నాన్నగారు రమ్మంటున్నారని చంద్రా వచ్చి చెప్పింది.

ఆయనకు ఒంట్లో బాగులేనట్లుంది. పడుకున్నాడు. పరిచయా లయాయి. సూటిగా అసలు విషయానికి వచ్చాడు. అద్దె కావాలి.

ముసలిది వెళ్లే ముందునాకుకచ్చితంగా చెప్పింది— ఇంటి అద్దెను పొరుగు పెద్దమనిషికి తప్ప ఇంకెవ్వరికీ ఇవ్వవద్దని. ఆ మాటే ఆయనతో అన్నాను.

ఆయన చిన్నగా నవ్వాడు. మిగిలిన రెండు వాటాల వారు అద్దెను తనకే చెల్లించారని చెప్పాడు. కాని, నేను ఒప్పుకోలేదు. కొంత ఘర్షణ పడ్డాం. చివరకు పొరుగు పెద్దమనిషి రావింపబడ్డాడు. ఆయన చెప్పిన తరవాతనే ఏభై రూపాయల అద్దెను చెల్లించాను.

ధన్యవాదాలు చెబుతూ నాకు బాకీ ఉన్న పది రూపాయలను తిరిగి ఇచ్చాడు.



చక్రంలో చిలుకమ్మ     ఫోటో—ఎమ్. వెంకటరమణి (మద్రాసు-30)

ఉదయం ఏడు గంటలకు నిద్ర లేచాను. బద్ధకంగా ఉంది. కిటికీ తలుపు తీసి వీథిలోనికి చూసేసరికి, ఎదురుగా రెండు రిక్షాలు కనిపించాయి. పిల్లలంతా టిప్ టాప్‌గా తయారయి రిక్షాలలో కూర్చున్నారు. రెండు సెకండ్ల తరవాత దంపతులిద్దరూ ఇంటికి తాళాలు వేసి రిక్షాల నెక్కారు.

ఎక్కడకో ప్రయాణ మవుతున్నట్లు నాతో మాటమాత్రంగా నయినా అనలేదు. మన కక్కరలేని సంగతు లెందుకని నా కుతూహలాన్ని చంపుకున్నాను.

రాత్రి ఒంటి గంటకు తిరిగి వచ్చారు. ఆడుతూ, పాడుతూ, కేరింతాలుకొడుతూ సంతోషంగా రిక్షాలలోనుండి దిగారు.

నాకు తరవాత తెలిసింది వారి ఘన కార్యం.

ఉదయం బయలుదేరి ఊరంతా రిక్షాలలోనే తిరిగారు. జగన్నాథస్వామి దర్శనంచేసుకున్నారు. మధ్యాహ్నం దగ్గరలో ఉన్న సాక్షిగోపాలానికి వెళ్లారు. తిరిగి వచ్చి మొదటి ఆట, రెండవ ఆట సినిమాలను చూశారు.

రెండు సార్లు టిఫిను, రెండు సార్లు భోజనం హోటలులోనే చేశారు.

రోమన్ హాలీడే!

లెక్కలు కట్టడానికి అలవాటుపడ్డ బుద్ధి నాది. ఒక రోజు సంతోషానికి సుమారు ఏభై రూపాయిలు తగలెట్టి ఉంటారని అంచనా వేసుకున్నాను. మూడు వాటాల అద్దె నూటఇరవై రూపాయిలు. బాకీలు మినహాయించగా మిగిలినది నూటపది. ఉన్న ఉద్యోగం పోగొట్టుకుని దమ్మిడీ సంపాదన లేక కుటుంబంతో సహా తల్లి నీడను బ్రతుకుదామని వచ్చిన ఆసామీ తల్లికి చెందవలసిన అద్దెను పుచ్చుకొని ఒక రోజు అగరొత్తుదీపాలు వెలిగించాడు.

ఆశ్చర్యపడ్డాను.

అసూయ పడ్డాను.

ఒళ్లు మండింది.

పరాయి డబ్బుపై బ్రతుకుతున్న పెద్ద మనిషి నూటపదిలో ఏభై రూపాయిలను ఒక్క రోజునే తగలెట్టాడు. మిగిలిన అరవై లోను ఆరుగురు ఇరవై తొమ్మిది రోజులు కాలక్షేపం చెయ్యాలి.

వారి గుండెధైర్యానికి ఆశ్చర్యం కలిగింది.

నేను ముందే చెప్పానుగా— ఈ రకమైన సాహసం మనకు ఉండదు. మనం చెయ్యలేని పని మరొకడు చేయగలిగితే, అతనిపై ఈర్ష్య కలగడం సహజం. నాకు లేని సాహసం అతనికున్నందుకు అసూయ పడ్డాను.




## మొదటి పర్యాయం బెలూన్‌లో దూరప్రయాణం

మొట్టమొదటి పర్యాయం బెలూన్‌లో దూరప్రయాణం చేసిన వారు ముగ్గురు ఇంగ్లీషువారు. 1836 లో వారు ఈ ఘన కార్యం సాధించారు.

పండ్ల వర్తకుడు ఛార్లెస్ గ్రీన్, 51 సంవత్సరాల వయస్సు కలిగిన వాడు, 80 అడుగుల ఎత్తు ఉన్న బ్రహ్మాండమైన బెలూన్ నిర్మించాడు. దానికి దిగువ ఒక 'గండోలా' ( పడవ వంటిది ) తగిలించాడు. 'రాయల్ వాక్స్ హాల్' అని ఆ బెలూన్‌కు నామకరణం చేశాడు. అతడి సహచరులు పార్లమెంటులో హేస్టింగ్సు నియోజక వర్గం ప్రతినిధి రాబర్ట్ హాలండ్, వేణువు విద్వాంసుడు థామస్ మాంక్ మేసన్.

మూడు వారాలకు సరిపోయే ఆహార పదార్థాలు తీసుకొని, బెలూన్‌ను అదుపులో ఉంచడానికి వెయ్యి అడుగుల పొడవు ఉన్న తాడు వేలాడదీసి, నవంబరు 7 అపరాహ్ణం 1—30 గంటలకు లండన్, వాక్స్‌హాల్ నుంచి బయలుదేరారు. చీకటిపడే సమయానికి ఇంగ్లీష్ ఛానెల్ మీదుగా పోయి, డోవర్, కెలే నగరాల మధ్య కడుపునిండా భోజనం చేశారు. లీజ్‌మీద పొరపాటున పోర్టబుల్ కాఫీ హీటర్ జారవిడిచారు.

చీకటిలో ప్రయాణం చేసి, తెల్లవారేసరికి మంచుతో నిండి ఉన్న కొండ ప్రాంతంలో అతి ప్రయాసతో క్రిందికి దిగారు.

పద్దెనిమిది గంటల కాలం 480 మైళ్ల దూరం ప్రయాణం చేసి, ఫ్రాంక్‌ఫర్ట్ అప్‌మెయిన్‌కి వాయవ్యంగా సుమారు 30 మైళ్లలో ఉన్న వెయిల్‌బర్గ్ చేరారు ఆ ముగ్గురు ఇంగ్లీషువారూ.

అమాయ ఎక్కడుందో, అక్కడ మంటలు తప్పవు. అందుచేతనే నాకు ఒళ్ళు మండింది.

కాని, జరిగిన సంఘటనలను మాత్రం నేను మరిచిపోలేకపోయాను. మరునాడు ఉదయాన్నే ఆయన ఏదో ఊరికి ప్రయాణం కట్టాడు. ఇరవై అయిదు రోజులు ఆ కుటుంబం ఏమి తిన్నదో, ఎలాగ కాలక్షేపం చేసిందో దైవానికే తెలియాలి.

ఫస్టు మూడు రోజ లుందనగా చంద్రా పది రూపాయి లడిగింది. అమాయతో కుతకుతలాడుతున్న నేను లేదని నిర్మొహమాటంగా చెప్పాను. పన్నెండేళ్ల చిన్నదాని మనస్సు, ఆ తల్లి మనస్సు గాయపడి ఉంటాయి. నేను పట్టించుకోలేదు.

ఎక్కడెక్కడ తిరిగాడో, ఏ ఘన కార్యాలు చేశాడో తెలియదు గాని, ఫస్టు ఉదయానికల్లా యజమాని పూరీలో వాలాడు.

తరువాయి కథ మామూలే.

ఈ విధంగా ఒకటి కాదు, రెండు కాదు— మూడు నెలలు గడిచాయి. వారి జీవిత దృక్పథం నాకు అప్పట్లో అర్థం కాకపోయినా, తరవాత ఆలోచించి చూస్తే కొంతవరకు అర్థమయింది.

రెండవ తారీఖు వారి జీవితాలలో ఒక విశిష్టమైన రోజులాగుంది. సంతోషంగా ఆ రోజున జల్సా చేసి, ఆ ఒక్క రోజున ఆర్జించిన తృప్తి, సంతోషాలతో మిగిలిన ముప్పై రోజులు, అవసరమయితే పస్తులుండయినా సరే, గడపడానికి సిద్ధపడిన కుటుంబం. నిష్పాక్షికంగా ఆలోచిస్తే అదొక రకమైన త్యాగమే. ఒక రోజు అత్యధిక సంతోషం కోసం ముప్పై రోజుల అవసరాలను పణంగా పెట్టుకున్నారు. పస్తులను, దరిద్రాన్ని అనుభవించడం మాటలతో పనికాదు. గుండె నిబ్బరం కావాలి. ఆ కుటుంబానికి ఎంతటి నిబ్బరముందో ఊహించుకోండి.

ఒక రోజు అమృతాస్వాదన కోసం ముప్పై రోజులు నిస్సంకోచంగా గరళం మింగగలిగారు. ముప్పై రోజులూ కష్టాల నెదుర్కొని, పస్తులను నిభాయించుకొని బయటపడకుండా, కిమ్మనకుండా రాబోయే ఆ ఒక్క రోజు కోసం నిరీక్షిస్తూ మూట గట్టుకున్న సంతోషాన్ని, తృప్తిని తలుచుకుంటూ కాలక్షేపం చెయ్యడం ఎందరికి సాధ్యం?

వారి జీవితా లలాగే గడిచిపోతాయి. వారికి నిరీక్షణ— ఆ ఒక్క రోజు కోసం. ఆ నిరీక్షణలోనే తృప్తి, ఆనందం అనుభవించారేమో? మన కటువంటి నిరీక్షణ లేదు. అందుకే ఇలాంటి ప్రశ్నలు అప్పుడప్పుడు వస్తాయి.

ఇదిరా, మూర్తీ, కథ. నీ ప్రశ్నకు జవాబు దొరికిందా?

ఇంతట్లో మా ఆవిడ వస్తున్నానని ఉత్తరం రాసింది. నిమిషాల మీద ఇల్లు మార్చాను.

ఆ కుటుంబం జీవిత విధానాన్ని నా భార్య చూడడం నాకు ఇష్టం లేదు. సహజంగా స్త్రీ ఆ రకమైన సుఖం కోరుకుంటుంది. మన కుటుంబాలలోని వ్యక్తులకు సుఖం దొరికితే కావాలి. కాని, దానికొరకు అవసరమయిన బాధలు పడడానికి మాత్రం సంసిద్ధులు కారు. మనకు దమ్ములేవు. పైగా ఒక్క రోజు జల్సా కోసం నెలంతా బాధ పడడానికి కావలసిన త్యాగం మన వద్ద లేదు. మన కష్టి కావాలి.

పిరికివాడి వనుకుంటారేమో! ఏమను కున్నాసరే ఫరవాలేదు. క్షణాలమీద మాత్రం ఇల్లు మార్చాను.”

* * *

సత్యం చెప్పిన కథ పూర్తయింది.

“బాబూ, ఆపరేషన్ పూర్తయింది. సాంబం బతికాడు. . . గండం గడిచి నట్లే. . .”

మునలాయన ఎప్పుడు వచ్చాడో వారికి తెలియదు. అత్యధిక సంతోషంతో మాటలు తడబడుతూ ఆయన చెప్పినది మాత్రమే వినిపించింది.

చెట్టుకింద మంట చల్లారింది.

మిత్రులు నలుగురి గుండెల్లోను మంట చల్లారింది.

ఒక్క ఉదుటున హాస్పిటల్ లోనికి పరుగెత్తారు. ★